నా పెళ్ళయి పట్టుమని నెల రోజులు కూడా కాలేదు అప్పటికి.

ఆఫీసులో ఆ కృపాచారి గాడు లంచవర్లో అందరికీ సగ్గుబియ్యం వడియాలు పంచి 'మా ఆవిడ చేసినవి' అని భుజాలెగరేస్తే-మర్నాడు మా ఆవిడ చేత కూడా అవే వడియాలు పెట్టించి ఆ రెండవ రోజు కిలో నూనెతో వేయించి ఓ పెద్ద స్టీలు టిఫిన్ నిండుగా ఆఫీసుకు తీసుకెళ్ళి కృపాచారిగాడి వడియాలకి పందెమేశా.

# 'శ్రీమతీ శభాష్'




పి.పి. వరప్రసాదరావు

ఆఫీసులో వాళ్ళంతా మా ఆవిడ చేసిన వడియాలే గెలిచాయన్నారు.

ఏమనుకున్నాడో-మా ఆవిడకి చేతకాదనుకున్నాడో ఏమో! మొత్తానికి నా భార్య చేసిన వడియాల దెబ్బకి కృపాచారిగాడు ఖంగుతిన్నాడు.

ఆ తర్వాత నాలుగు అయిదు రోజుల క్రితం-

'మా ఆవిడ చేసిన వచ్చళ్ళ రుచి చూడండి... నా భార్య గురించి నేను పొగడకూడదు కానీండి.. మా ఆవిడ చేసిన వచ్చళ్ళు తినాలని మా కాలనీ మొత్తం నోరు తెరుస్తుందనుకో' అంటూ నారాయణరావు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూటే [వచ్చడి కారానికి] అప్పటికి వచ్చళ్ళ సామ్రాజ్ఞి కానిది మా ఆవిడేనా అని-

అవతలి రోజు వేకువనే లేపి ఓ నాలుగు వచ్చళ్ళు చేయించి నవరేట్‌గా క్యారియర్ నిండా సర్దించుకుని వెళ్ళి లంచవర్లో అందరికీ వంచిపెట్టా-

దాంతో నా భార్య వచ్చళ్ళ శక్తి సామర్థ్యాలు కూడా అందరికీ అవగతం అయిపోయింది.

'అన్నీ తెల్సినావిడ నీకు భార్యగా వచ్చిందోయ్' అన్నారంత ముక్తకంఠంతో మళ్ళీ మళ్ళీ వచ్చళ్ళేసుకుని తిని తేన్చుతూ.

కాని తర్వాత రోజునో కొత్త చిక్కొచ్చి పడింది.

'మా ఆవిడ కథ మేగజైన్లో పడింది చూడండి' అంటూ గురుమూర్తి అందరికీ గర్వంగా పత్రిక చూపిస్తూ తిరుగుతుంటే ఎలాగైనా సరై నా భార్య చేత కూడా ఓ కథ వ్రాయించి అందరికీ చూపించాలన్న కోరిక మొదలైంది నాలో.

పిచ్చిది-ఇప్పటి వరకు నేను పెట్టిన పరీక్షలన్నింటిలోనూ నెగ్గుతూ వచ్చింది.. నా పరువు నిలబెడ్తూనే ఉంది..కాని ఈ కథలు, కాకరకాయల ఎవ్వారం తనకితెలుసో లేదో...

ఈ సారి నేను గురుమూర్తికి కౌంటర్ వెయ్యదల్చుకోలేదు.

కథ వ్రాయించి పబ్లిష్ అయ్యాక కాలరెగరేస్తే నబబుగా ఉంటుందని నిర్ణయించుకొని, అప్పటికప్పుడే కథలు పంపడానికి కావలసిన నియమనిబంధనలు రహస్యంగా సేకరించి ఆ కాగితం జేబులో పెట్టుకుని ఇంటికొచ్చి -

భార్య చెవిలో చల్లగా 'ప్లీజ్ ఓ కథ వ్రాసి పెట్టవే' అన్నాను విషయమంతా వివరించి.

'ఏమిటండీ మీ చాదస్తం-ప్రతి దానికీ ఇలా పోటీ వేసుకోవడం తగదండీ' అంది మా ఆవిడ.

నా చిన్నికదూ ఈ ఒక్క కథ వ్రాసి నా పరువు నిలబెట్టవే-ఉఇదే చివరిదనుకో.. బ్రతిమాలుతున్నట్లుగా అన్నాన్నేను.

కొంచెంసేపాగి-'అలాగే చూదాం లెండి' అంది తాను. అమ్మయ్యా! అసలు పూర్తిగా నావల్ల కాదంటే కాదనకుండా ఆ మాత్రమైనా అంగీకరించినందుకు కాస్తంత రిలీఫ్ దొరికింది నాకు.

దగ్గర కూర్చుని మరీ ప్రక్కరోజు ఉదయమే కథ వ్రాయిద్దామంటే ఓ స్నేహితుడి పెళ్లికోసం పొరుగూరు వెళ్ళవలసి వచ్చింది. ఉదయం 6 గంటలకే బయల్దేరి



ఏం లలితా నీరసంగా కనిపిస్తున్నావు'

'ఏం చెప్పను లక్ష్మీ, మా వారికి టైఫాయిడ్ కదా! రాత్రంతా జాగరణే అవుతుందనుకో'

''అదేంటి నర్సును పెట్టానన్నావుగా నీవెందుకు నిద్రమాని కూర్చోడం?''.

''నర్సును పెట్టాను కాబట్టే''.

-వీణ

బళ్ళారి

పెళ్ళికి అటెండయ్యి మళ్ళీ తిరిగి మా ఊరొచ్చేసరికి అర్జెంచటే ఆఫీసును వెళ్ళిపోవలసి వచ్చింది.

పెళ్ళి కెళ్ళి తిరిగొస్తుంటే బస్‌లో ఓ మేగజైన్ చూడటం అందులో కథల పోటీ వివరాలూ కన్పించటం జరిగింది. చివరి తేదీ దగ్గర్లో ఉంది. పనిలో పని.. నా శ్రీమతి చేత వ్రాయించబోయే కథని ఈ పోటీకే పంపాలని నిర్ణయించుకున్నాను.

ఒక దెబ్బకి రెండు పిట్టలు పడొచ్చు.. అప్పుడయితే గురుగూర్తి ముందు కాలర్‌తోపాటు భుజాలూ ఎగరెయ్యొచ్చుగదా!

అసలింతకీ మా ఆవిడకి ఈ కథల వంటకం సరిగా చేతవునో లేదో అన్న అనుమానం నన్ను పీకుతూనే ఉండింది.

మొత్తానికి ఆ వివరాలు కూడా పట్టుకొచ్చి సాయంత్రం ఇంటికొచ్చాక ఇంకొంచం 'గ్యాస్' కొట్టి కథా విషయం ప్రస్తావనకు పెట్టా.

తన ఇంటిపని వంట పనీ పూర్తయ్యాక తీరిగ్గా కూచుని 'కథ సంగతి తర్వాత గాని ఉదయం తీసుకెళ్ళి నదాంట్లో డబ్బేమైనా మిగిలిందా లేదా... ' అంది.

'ఛఛ ఈ ఆడాళ్ళకెప్పుడూ ఇదే అనుమానం' అని బయటికి బావుండదని 'ఉందిలేవే నిక్షేపంలా ఉంది.. ఖర్చయింది రాను పోను ఛార్జీలే.. అక్కడ పెళ్లిలో టిఫిన్ పెట్టకున్నా అలానే మాడుకుని చచ్చాను.. అది సరేగాని నువ్వు ముందా కథ సంగతి చూడవే' అన్నాను కాస్త చిరుకోపం అభ్యర్థన మేళవిస్తూ.

కొంచేం సేపు సీరియస్‌గా చూశాక-'సరే పెన్ను పేపర్లు పట్రండి'' అంది.

పెన్ను విరిగి పేపర్లో పడబోతోంది. ఇంకా ఆలస్యం చెయ్యదలుచుకోలేదునేను. వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్లి పెన్ను పేపర్లు కథ వ్రాయడానికి నియమనిబంధనలు అన్ని తీసుకొచ్చి శ్రీమతి ముందేసి ఆశగా కూర్చున్నాను.

'ఈ దెబ్బతో గురుమూర్తి పని గోవిందా' ఆనందం పట్టలేక పైకే అనేశానుకూడా.

ఇక నుంచి మీరు నేను చెప్పినట్లు చెయ్యండి, అడిగినప్పుడు అడిగినవాటికి కాస్తంత బుర్రకి పనిపెట్టి సమాధానాలివ్వండి చాలు.. కథ దానంతట అదే తయారయిపోతుంది.

నాకు అదేదో గమ్మత్తయిన కథలాగా అనిపించింది.

'ఇపుడు మీరు మీ స్నేహితుడి పెళ్ళికోసంగా పొరుగూరు వెళ్తున్నారు...'

అదేమిటే, ఉదయమేగా వెళ్ళొచ్చేశానుగదా! అన్నాను అర్థంకాక.

'ఎదురు తగలకండి.. నేను చెప్పినట్లు చెయ్యండి.. ముందు మీరు బస్సెక్కి కూచోండి'

'బస్సెక్కడమేమిటే నీ బొంద.. కథ సంగతి తర్వాత నీకేం పిచ్చిగాని పట్టలేదుకదా' అన్నాను కోపంగా.

దాంతో మా ఆవిడ ఛివాలున లేచి నన్ను వాలు కుర్చీలో కూర్చోబెట్టి 'అనుకోండి ఈ కుర్చీనే బస్ అనుకోండి.. కళ్ళు మూసుకుని బస్‌లో ఉన్నట్లు ఊహించుకోండి' హిప్నటైజ్ చేస్తున్నట్లుగా అంది.

అదెలాగే ఉబస్సంటే కాస్తంత డబ డబలాడుతుండాలి.. ఊగుతుండాలి.. కండక్టర్‌తో ప్యాసింజర్లు గొడవ పడ్తుండాలి.. పిల్లలు అరుస్తుండాలి.. బస్సెళ్ళి గుంతలో పడడం మనం బస్సు టాప్‌ని గుద్దుకోవడం.. నడుములు విరగడం.. ఇవన్నీ లేకుండా బస్సెలా అవుతుందే? అన్నాన్నేను నా ఇబ్బంది తెలియజేస్తూ.

ఓ చేత్తో కథ రాసుకునేందుకు సిద్ధమవుతూ ఎడమ చేత్తో నేను కూర్చున్న వాలు కుర్చీ ఊపసాగింది. నేను కళ్ళు మూసుకున్నాను. ఫర్లేదు... ఓ మాదిరిగా ఆ మూడ్ రాసాగింది.

ఓకే వన్ టూ థ్రీ కథ స్టార్ట్..

'ఇంతకీ బస్సు స్టార్టయ్యిందా...' అడిగింది మా ఆవిడ.

'లేదు స్టార్టింగ్ ట్రబుల్‌లాగుంది. నలుగురు మగవాళ్ళని దిగి బస్ నెట్టమంటున్నాడు డ్రైవరు' కల్పించి మాట్లాడ్తూ అన్నాన్నేను.

పోనివ్వండి, మీరు మాత్రం బస్‌దిగకండి.. ఇప్పుడు చెప్పండి.. బస్‌లో ఇంకెవరు కనిపిస్తున్నారు..ముఖ్యంగా మీ దృష్టినాకర్షిస్తూ... ఉన్నదున్నట్లుగా చెప్పండి... అబద్ధం చెప్పకండి.

'నిజమే చెప్తున్నాను.. అదుగో ఆ అమ్మాయి చూడు. వయసు టీనేజీలో ఉంటుందనుకుంటాను. మిలమిల మెరిసిపోతుందా తనువు. ఆ కురులు మాటిమాటికీ ఆమె ముఖ చంద్రబింబంమీద తుమ్మెదలా పారాడుతున్నాయి. ఖాళీసీటు కోసం లాగుంది ఆమెకళ్ళు అన్వేషిస్తున్నాయ్. పాపం చెమట పోస్తున్నట్లుందా అమ్మాయికి. కొంచెం యాక్షన్ కూడా చేస్తోందనుకో.. ఎక్కడికో అత్యవసర ప్రయాణంలా ఉంది.. నించోగలనా అని సందేహిస్తున్నట్లుంది-పోనీ లేచి నా సీటిచ్చెయ్యనా' అన్నాన్నేను.

పొరపాటున కూడా ఆ పని చేయకండి-ఉఎలాగూ కండక్టర్‌ని రానిచ్చి ఆ అమ్మాయి లేడీస్ సీట్లులో కూచున్న మగాళ్ళని లేపుతుంది లెండి, మీరు నిశ్చింతగా కూచోండి' అంది నా శ్రీమతి.

ఇక కళ్లు మూసి ఉంచడం నావల్లకానట్లు కళ్లు తెరచి' ఆ లేడీస్ సీట్లలో మగాళ్ళు కూర్చున్నారని నీకెలా తెలిసిందే' ఆశ్చర్యంగా అడిగాను.

మీ మగాళ్ళ బుద్ధే అంత... ఇంకా ఏం జరుగుతుందో కళ్లు మూసుకుని ఊహించండి.

ఇంతకీ నీవు కథ వ్రాస్తున్నావా? నా అనుమానం.

మీరు ముందు కళ్ళు మూసుకుని చూడండి...

శ్రీమతి చెప్పినట్లే కళ్ళు మూసుకున్నా... మా ఆవిడ చెప్పినట్లే ఆ అమ్మాయి కండక్టర్‌కి చెప్పి లేడీస్ సీట్లో కూర్చున్న మగాళ్లని లేవదీసి తాను కూచుంది.

నా ప్రక్కనొకడున్నాడు. రెండు సీట్లకి సరిపడా... ఇలాంటి వాళ్లకి రెండు ఫుల్ టిక్కెట్లు కొట్టినా అన్యాయం కాదు. దేహం అడ్డంగా పెంచేసింది కాక అంగుళం కూడా సర్దుకోరు. పైగా పైపైన బడ్తున్నాడు.... బస్సింకా కదలనేలేదు అపుడే నిద్ర... ఆ విషయమూ నోట్ చేసుకున్నాను కథలో.

ఇంతకీ నేనెక్కడున్నానో గమనించి నేనేం మాట్లాడు తున్నానో ఊహించి చెప్పండి....

చెప్తా రాసుకో... ఏమండీ జాగ్రత్త మధ్యలో ఎక్కడా టిఫిన్ చెయ్యకండి. ఎలాగూ పెళ్ళివారు పెడ్తారుగా... మధ్యలో తినడం వృధా, పైగా హోటల్ తిండి మీ వంటికి పడదు. మధ్యాహ్నం భోజనానికి క్యారియర్ పంపలేను కాని మీ కొలిగ్స్‌తో పంచుకొని తినండి.... అని అంటున్నావు.

''దానికి మీరేమంటున్నారు'' మళ్లీ కూపీ లాగింది శ్రీమతి.

''నేనా...ఆఁ. ఆఁ నా సంగతి నేను చూసుకుంటా గాని నువ్వు జాగ్రత్త... అంతగా పొద్దుపోకుంటే ప్రక్కింటి బామ్మని గాని పిన్నిని గాని పిలిపించి కూచోబెట్టుకో... రిక్షాలో వెళ్ళు ఖర్చవుతుందనుకోకుండా....'' అంటూ నా డైలాగులు శ్రీమతికి వివరించి చెప్పాను.

సరే బస్సు కదిలింది. ఇపుడందరికీ ఎంతో హాయిగా ఉంది.... అంతా రిలాక్సింగ్‌గా సీట్లలోకి జారుకున్నారనుకోండి... ఇంకేం జరుగుతుందో చెప్పండి

కండక్టరు టికెట్లు కొడుతున్నాడు... డ్రైవర్లు బస్ తోల్తున్నాడు....

కండక్టరు టికెట్లు కొట్టక డ్రైవర్ బస్సు తోలక మరేం చేస్తారు... ఏమైనా విశేషాలుంటే చెప్పండి.

అదా... అదుగో ఆ అమ్మాయి లేదూ, పుస్తకం ఏదో చదువుతూ మాటిమాటికీ ఎవణ్నో చూస్తోంది... జీన్స్ ప్యాంటూ గళ్ల చొక్కా వాడి జుత్తు... కోణంగి వెధవ లాగున్నాడు... వాడు ఈ అమ్మాయికి సైటేస్తున్నాడు....

ఎపుడూ అదే గొడవేనా, మీరా అమ్మాయి వైపు ఇక చూడకండి... అంది నా శ్రీమతి కోసం నటిస్తూ.

'ఎలానే చూడకుండా ఉండడం. ఆ అమ్మాయిది నా ముందు సీటే' కళ్ళు మూసుకుని అస్సలు విషయం చెప్పాను.

'అయితే ముందు మీరు అక్కడ్నుంచి లేచి వేరే సీట్లో కూర్చోండి'.

అలాగే ఊహించుకుంటూ ఆ సీట్లోంచి లేచి మరో సీట్లో కూర్చున్నాను.

'ఇక్కడో మెంటల్ కేసు దొరికింది తనలో తనే. నవ్వుకుంటున్నాడు' అన్నాడు శ్రీమతితో.

ఇంతకీ మీరు దిగాల్సిన స్టేజ్ వచ్చినట్లేనా?

''వచ్చినట్లే ఉంది' అన్నాన్నేను కళ్ళు మూసుకుని ఏ ఊరో ఊహించుకునేందుకు ప్రయత్నం చేస్తూ.

సరే? మీరు మీ ఫ్రెండు పెళ్ళికెళ్ళారు. మీకు చాలా ఆకలిగా ఉంది. ఎందుకంటే మీరు వెళ్ళేసరికి అక్కడ పెళ్లయిపోయింది. పెళ్లయిపోయిందాకా టిఫిన్ ఉంత దుగదా అదీ అయిపోయింది. అస్సలు టిఫిన్ చేద్దాం రమ్మని పిలిచిన నాథుడే లేడు. మీకు కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయ్. కాంటీన్లో తిందామంటే నా కిచ్చిన మాట అడ్డొస్తోంది. అలానే ఉండిపోయారు.

తిరిగి మన ఊరు వచ్చేందుకు బస్సెక్కి కూచున్నారు. ఎంతో మంది కాలేజీ అమ్మాయిలు ఎక్కారా బస్సులో... అయినా మీకిపుడు 'అందం' కనిపించడం లేదు 'ఆకలి' కనిపిస్తోంది. కండక్టర్ టిక్కెట్టడిగాడు. టిక్కెట్టిచ్చారు. బస్సు ఊరి పొలిమేరలు దాటింది. ఈ మధ్యలో డ్రైవరు సడన్‌బ్రేక్ వేశాడు. మీ నుదురు ముందు సీటుకు గుద్దుకుంది. బస్సులో ఒకరిద్దరు అలా సడన్‌బ్రేక్ వేసినందుకు డ్రైవర్‌తో గొడవ పడ్తున్నారు...

— — —

మీరేదో పెద్ద మనిషిలా లేచేళ్ళి ఆ గలభా సర్ది ఆ అమ్మాయిల ముందు సినిమా హీరో ఇమేజ్ సంపాదించుకున్నారు-

అదేమిటో చిత్రం- వాలు కుర్చీలో కూర్చుని ఊగుతూ మా శ్రీమతి చెప్తున్న కథ వింటుంటే నిజంగా బస్సులో వెళ్తున్నట్లే అనిపిస్తోంది నాకు.

ఇక ఢోకా లేదు కథ పూర్తయిపోతుందనిపించింది.

మళ్లీ నా వాలుకుర్చీ ఊగడం తన కథ ప్రయాణం మొదలయ్యాయి.

ఇక దిగండి- మన ఊరు వచ్చేసింది. ఆఫీసుకెళ్ళారు. మధ్యాహ్నం భోజనం మీ కొలిగ్స్ దగ్గర సర్దుకుతిన్నారు. ఇంటికొచ్చారు.

ఏమిటీ ఇంత త్వరగా ముగింపు కొచ్చేశావు?

ఇక్కడే ఒక కొసమెరుపుంది' నవ్వింది మా ఆవిడ.

ఏమిటా మెరుపు....

'కాసేపాగండి... అప్పటిదాకా అదీ సస్పెన్సే' అంటూ మిగతా కథ పూర్తి చేసేందుకు తయారయిపోయింది శ్రీమతి.

మీరు అలసిపోయి ఇంటికి వస్తారు. ఆప్యాయంగా నేను షర్ట్ బటన్లు విప్పుతాను. కొంగుతో మీ ముఖానికి పట్టిన చెమట తుడుస్తాను. వేడి వేడి పకోడీలు క్షణంలో చేస్తాను. మీరు స్నానం చేసి వస్తారు. ప్రయాణపు బడలిక ఆఫీసులో పడిన కష్టం అంత మర్చిపోయి పకోడీలు తిని కాఫీ త్రాగుతారు....

ఇక్కడే కొస మెరుపు

ఏమిటి? ఉండ బట్టలేక కళ్ళు తెరిచాన్నేను

ఉన్నట్టుండి కథ బయటకొచ్చేస్తూ 'అయ్యో నా మతి మండ... ప్రక్కింటి పిన్నికి ఓ ఇరవై రూపాయలడిగితే ఇస్తానన్జెప్పి అక్కడ నిలబెట్టి వచ్చాను... మీరేమో కథలోకి దించేశారు' అంటూ నా షర్ట్ జేబులు వెతక సాగింది మా ఆవిడ డబ్బు కోసం.

ఒక్క క్షణం ఆగి—

'ఏమండీ జేబులో పైసా కూడా లేదేమిటండీ...''

ఏదో అనుమానం ఆవరిస్తుండగా గబగబా వెళ్ళి జేబులు వెదుక్కున్నాను. నెత్తిన పిడుగు పడ్డట్టయింది నాకు.

'ఏమైందండీ' కంగారుగా అడిగింది మా ఆవిడ.

కొంప మునిగింది - ఉదయం తిరుగు ప్రయాణంలో కండక్టర్ దగ్గర చిల్లర డబ్బులు తీసుకోవడం మర్చిపోయాను. ఇపుడా కండక్టర్ ఎవరనీ ఎక్కడనీ ఎలా పట్టుకోవడం...

రూపాయి రెండు రూపాయలైతే ఫర్లేదు పది రూపాయల ఛార్జీకి 100 రూపాయల నోటిచ్చాను... అదలాగే పటుకెళ్ళిపోయిన కండక్టరు మీద ఎనలేని కోపం కలిగింది.

'అస్సలేం జరిగిందో చెప్పండి'.

'ఏముంది. పొయ్యేటప్పుడు ఛార్జీకి నా దగ్గర పది రూపాయలు విడిగా ఉంటే ఇచ్చాను. వచ్చేటప్పుడు వంద రూపాయల నోటిస్తే తొంభయి రూపాయలు ఢ్యూ రాశాడు వెధవ...'

'అయ్యో అన్యాయంగా తొంభయి రూపాయలు తగలేశారు కదండీ...'

పోనీ... నా దగ్గర అన్యాయంగా డబ్బు కొట్టేసి వాడేలా బాగుపడ్తాడో అదీ చూస్తాను... వాడికీపాటికే కాలో చెయ్యో విరిగే ఉంటుంది...

పోనీండి వాళ్ళ పాపం వాళ్ళది... అలా నా శ్రీమతి బుజ్జగించేవరకు నా నోటికొచ్చినవన్నీ తిట్టేశానా కండక్టర్ని. ఎన్నెన్ని భాషల్లో తిట్టాలో అన్ని భాషల్లోనూ తిట్టాను. ఏకంగా జాతి జాతిగా కండక్టర్ల నందర్నీ కలగలిపి తిట్టాను.

అపుడు.....

'ఇక చాల్లేండి.... కథ పూర్తయిపోయింది' అంది మా ఆవిడ.

అదేమిటే.....

అవును ఆ తొంభయి రూపాయలు ఆ కండక్టరు నిజాయితీగా మీకిచ్చేశాడు. మీరే ముందు వెనుకలు ఆలోచించకుండా అతన్ని ఆడిపోసుకున్నారు...

నా నోట మాట రాలేదు. నిదానంగా కండక్టరు తొంభయి రూపాయలు తిరిగిచ్చిన సన్నివేశం నా కళ్ళ ముందు నిలిచి నన్ను వేలెత్తి 'అనవసరంగా నోరు పారేసుకున్నావ్' అని దూషించసాగింది.

'ఇదే కొసమెరుపు' అంటూ తాను తీసిదాచిన తొంభయి రూపాయలు, రాసిన కథ నా చేతిలో పెట్టింది శ్రీమతి, తన పనయిపోయినట్లు.

మళ్ళీ వాలు కుర్చీలో కూలబడిపోయాను. కథయితే పూర్తయిపోయింది. అనవసరంగా కండక్టర్ని నిందించినందుకు నా అంతరంగం నన్ను పొడుచుకు తినసాగింది.

అవునూ! నిజ జీవితంలో ఎన్ని కథలున్నాయి!

నన్నే కథగా అల్లిన నా శ్రీమతివేపు మెచ్చుకోలుగా చూశాను.

'కాకరకాయలు తరిగే చేతులే కథలూ అల్లగలవు' అన్నట్లుగా చూసింది నా భార్య నాకేసి. నిజమే మరి! ఒప్పుకుని తీరాల్సిందే!

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఇద్దరు ప్రేమికులు చర్చించుకుంటున్నారు. ఆఅమ్మాయిని పెళ్ళికి ఎలాగైనా ఒప్పించాలని అబ్బాయి తంటాలు పడ్తున్నాడు. చివరకు విసిరిపోయి.. 'నువ్వు గనుక నాతో పెళ్ళికి ఒప్పుకోకపోతే రాబోయే రైలు కిందపడి చచ్చిపోతాను' బెదిరింపుగా విసుగ్గా చెప్పాడు.

'నన్ను కాస్తా ఆలోచించుకోనివ్వు డియర్! రైళ్ళకేం అరగంటకొకటి వస్తూనే ఉంటాయి' జవాబిచ్చింది. ప్రేయసి.

-రాజు
గుంటూరు